
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 98 | బుధవారం 15 జూలై 2026 | పేజీలు : 4 | వెల : 3/-



# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

## మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన

## రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి

## రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం

## గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు

## కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో - మిగతా 2లో

# రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం

## వరుసగా రెండో ఏడాది ట్రూ డౌన్ అమలు

## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




**(అంకుశం, అమరావతి, జూలై 15):**

దేశంలో ట్రూ--అప్ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, ట్రూ--డౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామని, ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లకు తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం - మిగతా 2లో

# ముద్రగడ పద్మనాభం అంతిమయాత్రలో పాడె మోసిన జగన్

## కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన జగన్





**(అంకుశం, కిర్లంపూడి, జూలై 15):**

మాజీ మంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం పార్థివదేహానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ముద్రగడ పద్మనాభం గారి నివాసానికి చేరుకున్న ఆయన, పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి అశ్రునివాళి అర్పించారు. అనంతరం ముద్రగడ పద్మనాభం సతీమణి, కుమారుడు ముద్రగడ గిరిబాబు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించిన వైయస్ జగన్, ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాంక్షిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభంతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్న వైయస్ జగన్, ఆయన ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. సమాజం కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా ముద్రగడ పద్మనాభం చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం అంతిమ సంస్కార కార్యక్రమం పూర్తయ్యే వరకు వైయస్ జగన్ అక్కడే ఉండి నివాళులు అర్పించారు. అనంతిమయాత్రలో స్వయంగా పాల్గొని ముద్రగడ పద్మనాభం పాడెను మోసి, ఆయన పట్ల తనకున్న గౌరవం, ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు.

# ఆయుష్ వైద్యానికి హబ్‌గా ఏపీ

## ఔషధ మొక్కల పెంపకానికి ప్రోత్సాహం

## ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద వైద్య కళాశాలలు

## ప్రొద్దుటూరులో యునాని కళాశాల

## వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




**(అంకుశం, అమరావతి, జూలై 15):**

ఆయుష్ వైద్యానికి ఆంధ్రప్రదేశ్ హబ్ గా మారుస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అత్యంత నిరాదరణకు గురైన ప్రాచీన ఆయుష్ వైద్యానికి పునరుజ్జీవం తెచ్చేందుకు రూ. 414 కోట్లతో అభివద్ధి చర్యల్ని చేపట్టామని చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం 'ఔషధ మొక్కల స్థిరమైన సాగు, ఆర్థిక వద్ధి, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు' అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, నేచురోపతి, హోమియోపతి) విభాగం పరిధిలో భారీ అంచనా వ్యయంతో వైద్య మౌలిక సదుపాయాల అభివద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. కేవలం రోగం వచ్చిన తర్వాత చికిత్స అందించే 'రియాక్టివ్--క్యూరేటివ్' విధానం నుంచి, రోగాలను ముందుగానే గుర్తించి నివారించే 'ప్రెడిక్టివ్--ప్రివెంటివ్--వెల్‌నెస్ సెంట్రిక్' ఆరోగ్య విధానం వైపు ప్రభుత్వం అడుగులు - మిగతా 2లో

## అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో

# రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఆకస్మిక తనిఖీ

### నాణ్యమైన ఆహారం, పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**అంకుశం న్యూస్ మడకశిర జూలై 15:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ గౌరవ సభ్యులు ఇ. లక్ష్మీ రెడ్డి బుధవారం మడకశిర, రొల్ల, అమరాపురం మండలాల్లోని పలు ప్రభుత్వ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్, విద్యార్థులకు, గర్భిణులకు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహార నాణ్యతను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మడకశిరలోని చిప్లేటి–2 అంగన్‌వాడీ కేంద్రం, రొల్ల మండలంలోని కల్లురప్పం అంగన్‌వాడీ కేంద్రం, రొల్ల కేజీబీవీ, మరియు అమరాపురం గురుకుల పాఠశాలలను సందర్శించారు. చిప్లేటి మరియు కల్లురప్పం అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు, గర్భిణులకు పంపిణీ చేస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం నిల్వలను ఆయన తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని, హాజరు శాతాన్ని మెరుగుపరచాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలను ఆదేశించారు. ఆహార పదార్థాల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

**రొల్ల కేజీబీవీ తనిఖీ...**

రొల్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లోని వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, ఆహార పదార్థాల నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల ప్రత్యేకాధికారి కి సూచించారు. అమరాపురం గురుకుల పాఠశాల సందర్శన...

అమరాపురం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు నాణ్యమైనవి వాడాలని, వంటగది



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఇ. లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆహార ధాన్యాల పంపిణీలో గానీ, మధ్యాహ్న భోజన పథకం అమలులో గానీ ఎటువంటి నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడినా సంబంధిత అధికారులపై, సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో లో డిఎస్‌ఓ వంశీ కృష్ణ రెడ్డి,సివిల్ సప్లైస్ డిఎం రాజు నాయక్, ఐసిడిఎస్ పిడి ప్రమీల,వీణవీ ఎడి వినయ్, తహశీల్దార్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, రెవెన్యూ మరియు ఆహార సరఫరా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

-మొదటిపేజీ తరువాయి

పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019–24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు.

తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార–నాగావళి–గోదావరి–కృష్ణా–పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# చంద్రబాబు పాలనలో రైతులకు అవస్థలు

-- నేను ఉన్నాను.. మీ కష్టాలు నాకు తెలుసు

-- ఆక్వా రైతులకు వైయస్ జగన్ భరోసా

-- ఆక్వా రైతుల ముఖాముఖిలో వైయస్ జగన్



**(అంకుశం, భీమవరం, జూలై 15):** చంద్రబాబు ఎప్పుడు వచ్చినా, రాష్ట్రంలో వ్యవసాయ రంగం, రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతారని, ఇంకా ఆక్వా రంగం పరిస్థితి దారుణంగా మారుతుందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పుడు కూడా ఏ ఒక్క పంటకూ కనీస గిట్టుబాటు ధర లేదని, మరోవైపు ఆక్వా సాగు రంగం దుర్భరస్థితిలో కొట్టుమిట్టాడుతోందని ఆయన గుర్తు చేశారు. ఒకవైపు ఆక్వా సీడ్, ఫీడ్ ధరలు దారుణంగా పెరగ్గా, మరోవైపు పంట కొనుగోలు ధరలు పతనమయ్యాయని చెప్పారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా.. ఇదే పరిస్థితి కొనసాగుతోందన్న ఆయన, పలు అంశాలు ప్రస్తావించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న వైయస్ జగన్, వారికి భరోసా ఇచ్చారు. 'నేను ఉన్నాను. మీ కష్టాలు నాకు తెలుసు' అంటూ ఆక్వా రైతులకు ధైర్యం చెప్పారు. రాబోయేది తమ ప్రభుత్వమే అన్న వైయస్ జగన్, తాము రాగానే ఆక్వాలో ఇప్పుడున్న సిండికేట్‌ను కూకటివేళ్లతో సహా పెకిలించి వేస్తామని, 'అప్సడా'కు పూర్వ వైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. భీమవరంలో ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో వైయస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే.. ఈరోజు మీరు చూపిస్తున్న ఈ ఆదరణ, అభిమానానికి నిజంగా నోటిలో నుంచి మాట కూడా రానంతగా భావోద్వేగం. ఇసుక వేసినా రాలనంతగా కంటి చూపు మేరలో ఎక్కడా కూడా ఖాళీ స్థలం కనిపించనంతగా, ఈ అభిమాన తరంగాల మధ్య మీరు చూపిస్తున్న ఈ ప్రేమ, ఈ అభిమానానికి ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు, ప్రతి తాతకు, ప్రతి సోదరుడికి, ప్రతి స్నేహితుడికి ముందుగా రెండు చేతులు జోడించి పేరు పేరున హృదయపూర్వకంగా కతజ్ఞతలు తెలుపుకుంటా ఉన్నాను. ఈరోజు రాష్ట్రంలో పరిస్థితి గమనిస్తే లక్షన్నరకు పైగా రైతులు ఐదు లక్షలకు పైగా ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దాదాపు 15 లక్షల మందికి ఆక్వా రంగం ఉపాధి కల్పిస్తోంది. కానీ ఈ రంగంలో పరిస్థితులు చూస్తే, మానవత్వం ఉన్న ఏ ఒక్కరికైనా కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. అంత దయనీయమైన పరిస్థితిలో ఈరోజు ఆక్వా రంగం ఉంది. ఇష్టానుసారంగా ఫీడ్ ధరలను పెంచుకుంటూ పోతున్నారు. నిజానికి ౖఫీడ్ ధరల పెంపు అనేది రైతుల అంగీకారంతోనే జరగాలి కానీ, ఏకపక్షంగా కాదు. ఫీడ్ ధరలు పెంచాలంటే సమీక్ష జరగాలి. అలాగే దానికి ఒక హేతుబద్ధత ఉండాలి. ధరల పెంపుపై సమీక్షించాలంటే.. ఫిష్ మీల్ సమద్ధిగా ఉండే అక్టోబరు, నవంబరు నెలల్లో, హేతుబద్ధంగా ఒక నిర్ణయం తీసుకోవాలి. అలా కాకుండా అందుబాటులో ఉన్న కారణంలో ఫీడ్ రేట్లపై ఇష్టానుసారం రివ్యూ చేయకూడదు. దీనిపైనే ఇటీవల ఆక్వా రైతాంగం తమ గోడు వెళ్లబోసుకున్నారు. అందుకే ఈ ప్రభుత్వానికి అప్పుడే అల్టిమేటం కూడా జారీ చేశాం. చంద్రబాబు ప్రభుత్వం ప్రతి అడుగులోనూ కూడా మోసం, మోసం, మోసం అనే పదాలే వినిపిస్తాయి. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు ఏ మాదిరిగా చంద్రబాబునాయుడుగారు మోసాలతో అడుగులు ముందుకు వేసాడో, ఎన్నికలప్పుడు బాండ్లు ప్రతి ఇంటికి పంపిణీ చేసి ఏ మాదిరిగా ప్రజలను మోసం చేశాడో, అదే మాదిరిగా ఆక్వా రైతులను కూడా ఆయన మోసం చేస్తూ వచ్చాడు. ఇవాళ ఈ సందర్భంగా మీ అందరికీ కూడా నేను ఒకటే హామీ ఇస్తున్నాను. 'మీ కష్టాలు నాకు తెలుసు. నేను ఉన్నాను' అని మాత్రం మీ అందరికీ చెబుతున్నాను. చూస్తుండగానే రెండేళ్లు గడిచాయి. కళ్ళు మూసుకొని కళ్ళు తెరిచే సరికే మరో మూడేళ్లు గడుస్తాయి. ఆ తర్వాత రైతుల ప్రభుత్వం వస్తుంది అని చెప్పి కూడా ఈ సందర్భంగా గర్వంగా చెప్పగలుగుతాను. మళ్ళీ 'అప్సడా' పూర్వ వైభవంలోకి వస్తుంది. ఆ సంస్థకు సీఎం ఛైర్మన్‌గా ఉంటాడు. ఇప్పుడున్న సిండికేట్‌ను కూకటివేళ్లతో సహా పెకిలిస్తానని పేర్కొన్నారు.

## శ్రీ రామకృష్ణ మఠం సమస్యను పరిష్కరిస్తాం ఎమ్మెల్యే సునీత...



**అంకుశం న్యూస్, అనంతపురం, జూలై 15** వైద్యం, విద్యతోపాటు వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీ రామకృష్ణ మఠం స్థాపనకు స్థలం కేటాయించాలని... రామకృష్ణ సేవా సమితి సభ్యులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కోరారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతతో వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మఠం చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, శారదాదేవి, స్వామి వివేకానందల ఆదర్శాలతో ఆధ్యాత్మిక, విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మఠం ద్వారా నిత్య పూజలు, ధ్యాన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, యువతకు విలువలతో కూడిన విద్య, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఉచిత వైద్య శిబిరాలు, సామాజిక ఆరోగ్య సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితుల్లో సహాయక సేవలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మఠం రాప్తాడు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయడం వలన స్థానిక ప్రజలకు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కేంద్రంగా నిలిచి, భావితరాలకు కూడా ఉపయోగపడే విధంగా ఉంటుందని వివరించారు. అయితే మఠం కార్యకలాపాలకు సుమారుగా 10 ఎకరాల వరకు స్థలం అవసరం ఉంటుందని చెప్పారు. కామారుపల్లి వద్ద ఈ స్థలాన్ని గుర్తించామని.. ఆ స్థలాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే పరిటాల సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి నిబంధనల మేరకు సాధ్యమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ముద్రగడ మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 15:** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్,మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎందరో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ముద్రగడ మృతి ఎంతో బాధాకరమన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ ఉన్నప్పుడు ఆయన ఎంపీ గా చేశారని, అప్పట్లో తమ మధ్య మంచి సాన్నిహిత్యం ఉండేదని గుర్తు చేసుకున్నారు. ఆయన ఇంటికి వెళ్ళినప్పుడు స్వయంగా ఆయనే వడ్డిస్తూ ఎంతో ప్రేమా ఆప్యాయతలను కనబర్చేవారని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం.. రూ.10 వేల జరిమానా

**గుడిబండ, అంకుశం.న్యూస్ :15** పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన ముగ్గురిని పట్టుకుని కోర్టులో హాజరుపరచగా, ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు గుడిబండ ఎస్‌ఐ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన సుమారు 20 మందిని కోర్టుకు పంపగా, ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించిందని ఆయన తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్‌ఐ హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో పట్టుబడిన వారికి రూ.10 వేల జరిమానా విధిస్తామని, రెండోసారి అదే నేరానికి పాల్పడితే జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గొడవలకు దిగడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పోలీసులు ఇలాంటి తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

## రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం

-మొదటిపేజీ తరువాయి

చేసుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వల్పకాలంలోనే గాడిలో పెట్టారని మంత్రి అన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించిన రూ.6,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రస్తుతం వివిధ దశల్లో అమలవుతున్నాయని, నిర్ణీత గడువులో అవసరమైన అన్ని సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

## ఆయుష్ వైద్యానికి హబ్‌గా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

వేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రాచీన ఆయుష్ వైద్య సేవల విస్తరణలో భాగంగా రూ. 280 కోట్లతో నాలుగు కొత్త ఆయుష్ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద వైద్య కళాశాలలు,




ప్రొద్దుటూరులో యునాని కళాశాలలు రాబోతున్నాయని చెప్పారు. ఒక్కో కళాశాలకు రూ. 70 కోట్లు వ్యయం చేస్తామని చెప్పారు. ఇప్పటికే విశాఖపట్నంలో నేచురోపతి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు (మొత్తం రూ. 280 కోట్లు ) పూర్తికావొచ్చాయని తెలిపారు. అదేవిధంగా తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు(పర్యావరణ, అటవీ శాఖ) పి.. మల్లికార్జున రావు, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, ఏపీ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ బోర్డ్ ఛైర్మన్ డాక్టర్ పి.వి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

# అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపించాలి




ఈ నెల జులై 18న నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమానికి సంబంధించి "వరదలు సిద్ధంగా ఉన్న ఆంధ్ర"థీమ్ తో కార్యక్రమం నిర్వహణ
జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అంకుశం న్యూస్అనంతపురం, జులై 15 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం రమేష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 520 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిత్యం మానిటర్ చేస్తూ నాణ్యతగా అర్జీలను పరిష్కరించడం చేయాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను కూడా గడువులోపు పరిష్కరించాలని, ఇప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరించడం ముఖ్యమైనదన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సత్వరమే పరిష్కారం చూపించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం చూపించరాదన్నారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, జులై నెలకు సంబంధించి "వరదలు - సిద్ధంగా ఉన్న ఆంధ్ర" థీమ్ తో కార్యక్రమం నిర్వహించాలని, ఇందుకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డిపిఓ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డ్వామా పిడి సలీమ్ భాష, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిసిఓ అరుణకుమారి, హౌసింగ్ పిడి శైలజ, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, డిఆర్డీఏ పిడి శైలజ, డిపిఓ నాగరాజు నాయుడు, డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి వరప్రసాద్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రమణ్యం, ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, సెక్షన్ సూపరింటెండెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, రియజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రామగిరి లో భారత్ గోల్డ్ మైన్ యూనిట్‌ను
# పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర...




**అంకుశం న్యూస్, సత్య సాయి జిల్లా, జూలై :15** రాష్ట్రంలో జొన్నగిరికి మించిన మరో గోల్డ్ మైన్ అందుబాటులోకి రానుందని మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మూత పడ్డ భరత్ గోల్డ్ మైన్ యూనిట్ ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు ఇతర జిల్లా టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. బంగారం గనులున్న ప్రాంతాన్ని మొత్తం వారు పరిశీలించారు. అలాగే గతంలో అక్కడ పని చేసిన కార్మికులు, స్థానికులతో మంత్రి, ఎమ్మెల్యే సునీత మాట్లాడారు. అనంతరం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సందర్శించి ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర గార్ల విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై మినిట్స్ పుస్తకంలో సంతకాలు చేశారు. బంగారు గనుల్లో పనిచేసిన వారితో అర్జీలు స్వీకరించారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు.

# డీలిమిటేషన్ లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని




**అంకుశం న్యూస్, రాయదుర్గం, జూలై :** 15 అఖిల భారత మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు రాయదుర్గం నియోజకవర్గ సమితి మహిళలకు 33% రిజర్వేషన్ - డీలిమిటేషన్ సాకు వద్దు అఖిల భారత మహిళా సమాఖ్య - ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణం పోస్ట్ ఆఫీస్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.ఎఫ్.ఐ డబ్ల్యూ అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పార్వతి ప్రసాద్ పద్మావతులు మాట్లాడుతూ ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే డీలిమిటేషన్ పేరుతో జాప్యం చేయకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే ప్రవేశపెట్టి, చట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రక్తపు సంతకాలతో పోస్టల్ కార్డుల ద్వారా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారికి రక్తపు సంతకాలతో ఉత్తరాలు పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని, తమ రక్తంతో సంతకాలు చేసిన పోస్టల్ కార్డులను పోస్ట్ చేశారు. "మహిళల రాజకీయ భాగస్వామ్యం కోసం వెంటనే చట్టం తీసుకురావాలి" అంటూ నినాదాలు చేశారు. 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఇక ఆలస్యం చేయకుండా ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదించాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో మళ్లీ 10-15 సంవత్సరాలు వాయిదా వేయడం మహిళలకు చేస్తున్న అన్యాయమని తెలిపారు. మహిళలు జనాభాలో సగం ఉన్నారు. కానీ పార్లమెంటు, అసెంబ్లీల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. అందుకే 33% రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మహిళా సమాఖ్య నాయకురాలు : జైనబి రేష్మ, లింగమ్మ , లలితమ్మ , నిర్మలమ్మ , స్వప్న , సోలహ గౌసియా, కోమల, ప్రియ తదితరులు పాల్గొన్నారు. మహిళల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేస్తామని నాయకురాళ్లు తెలిపారు.

## కాపు ఉద్యమ నాయకులు ముద్రగడ పద్మనాభం మృతి తీరని లోటు

సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ నివాళి



**అంకుశం న్యూస్ విజయవాడ, జూలై 15:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నాయకులు ముద్రగడ పద్మనాభం మృతి తీరని లోటు అని సీనియర్ రాజకీయ నాయకులు, ప్రముఖ కాపు సామాజిక వర్గ నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. ముద్రగడ అకాల మరణం చెందారన్న వార్త అత్యంత దిగ్భ్రాంతికరం, బాధాకరమని పేర్కొన్నారు. సమాజం కోసం, కాపు సామాజిక వర్గం ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ చిరస్మరణీయమని నివాళు లర్పించారు. ముద్రగడతో తనకు ఉన్న అనుబంధం, ఆయనతో కలిసి పనిచేసిన సందర్భాలు తన మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయన్నారు. సమాజ హితం కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పరితపించిన ధీశాలి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మన మధ్య లేకపోవడం తీరని లోటు అని పేర్కొన్నారు. ఉద్యమమే ఊపిరిగా, ఆత్మగౌరవమే లక్ష్యంగా సాగిన ఆయన ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన నుండి తాను పొందిన మార్గనిర్దేశం ఎంతో విలువైనవనీ, ఆ జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేనివనీ తెలిపారు. ప్రజా నాయకుడిగా, పోరాట యోధుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. పద్మనాభం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సరికొత్త ప్రస్థానానికి డిప్లొమా నూతన విద్యార్థుల శ్రీకారం



**రాప్తాడు అంకుశం న్యూస్ జూలై 15** స్థానిక వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ) డిప్లొమా కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ మరియు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరంలో అడుగుపెట్టిన విద్యార్థులకు యాజమాన్యం, అధ్యాపకులు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కళాశాల కరస్పాండెంట్ వి.బి.ఆర్. శర్మ, చైర్మన్ బి.వి. కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్ర రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ (ఎం.డి.) వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ టి. విష్ణు వర్ధన్ లు జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు (టెక్నికల్ స్కిల్స్), కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం డిప్లొమా ప్రిన్సిపాల్ ఎన్. ఫణి రాజారావు సభకు స్వాగతం పలికి, ఇండక్షన్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించారు. కొత్తగా చేరిన విద్యార్థులు కళాశాల విద్యా విధానం, నిబంధనలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు మరియు విలువలను పూర్తిగా అవగాహన చేసుకుని తమ విద్యా ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాయనవారిపల్లి మాజీ సర్పంచ్ రంగస్వామిని పరామర్శించిన మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్



**సింగనమల, అంకుశం న్యూస్ జూలై 15** మండల పరిధిలోని నాయనవారిపల్లి మాజీ సర్పంచ్ శ్రీ రంగస్వామిని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ బుధవారం ఉదయం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. "ధైర్యంగా ఉండండి... మీకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అంటూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వంశీ, గోకుల్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, జడ్పీటీసీ భాస్కర్, నూర్ మహమ్మద్, బండి శ్రీనివాసులు, వెంకటరమణ, భాస్కర్ రెడ్డి, నారాయణస్వామి రోటరీ పురం సత్యాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.